సాక్షి
గుంటూరు
ఆదివారం । 17 । నవంబర్ । 2024




నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

శావల్యాపురం: శావల్యాపురంలోని నిదానంపాటి అమ్మవారి తిరునాళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి కోటపాటి మృత్యుంజయుడు, లక్ష్మీ పార్వతి దంపతులు రూ.1,01,116 అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4513 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2460 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

సినీ నటి శ్రీరెడ్డిపై కేసు నమోదు

లక్ష్మీపురం (గుంటూరుఈస్ట్) : తెలుగు మహిళ నాయకురాలు ఫిర్యాదు మేరకు సినీ నటి శ్రీరెడ్డిపై గుంటూరులోని నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళ నాయకురాలు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారానికి చెందిన మాజీ కార్పొరేటర్ దాసరి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టు చేయడం వల్ల మనో భావాలు దెబ్బతినేలా చేసిన శ్రీరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన కోరారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వ్యవసాయ కళాశాల్లో పలు పోటీలు

బాపట్ల: 2024–25 వార్షిక రెండో దశ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఆదివారం నుంచి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ కళాశాలలో ప్రారంభం కానున్నాయని డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ జి. కరుణా సాగర్ తెలిపారు. 20వ తేదీ వరకు జరిగే పోటీల్లో విశ్వవిద్యాలయానికి చెందిన 19 అనుబంధ కళాశాలలకు చెందిన 612 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా క్రీడా పోటీల్ని కళాశాల ప్రాంగణంలోనే నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు స్పోర్ట్స్ పెవిలియన్ వద్ద నిర్వహించనున్న ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆర్.శారదా జయలక్ష్మీదేవి, గౌరవ అతిథిగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గుంటూరు డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్‌పాల్గొంటున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి తెలిపారు. విస్తరణ విభాగాధిపతి ఎం.సురేష్ కుమార్, ఎం.రమాదేవి, టి. ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయుకే రైఫిల్ జట్టు ఎంపిక



పెనమలూరు: జేఎన్‌టీయుకే రైఫిల్ షూటింగ్ జట్టును ఎంపిక చేశామని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తాడిగడపలోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో జట్టు ఎంపిక నిర్వహించామన్నారు. ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ స్త్రీ, పురుషుల విభాగాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. జట్టులో ఎయిర్ రైఫిల్ పురుషుల విభాగంలో పి.ఉదయ్‌కిరణ్ (ఎస్ఆర్‌కే కాలేజ్, ఎనికేపాడు), ఎం.హేమంత్ రిషికేష్ (ఆర్వీఐటీ చేబ్రోలు), వి.ప్రదీప్‌చంద్ర (విట్ భీమ వరం), మహిళల విభాగంలో ఎస్. మేఘన(వీఆర్ కానూరు), ఎయిర్ పిస్టల్ పురుషుల విభాగంలో బి.గౌరీనాథ్ (కిట్స్ గుంటూరు), లక్ష్మణరాయ్ (ప్రగతి కాలేజీ సూరంపాలెం), సాయిమనీష్‌సాయిరామ్ (ఆదిత్య, సూరాయపాలెం). మహిళా విభాగంలో ఆర్.శ్రీలాస్య (విష్ణు కాలేజీ భీమవరం) ఎంపికయ్యారన్నారు. ఈ ఎంపికలో పరిశీలకుడిగా శౌరయ్య, ఎం.విక్టర్ జాన్సన్, కోచ్ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వర రావు, పోతిన రఘు పాల్గొన్నారు.

సమాజ హితమే భక్తికి పరమార్థం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): దుర్గా.. అని పలికినంత మాత్రాన భక్తుల కష్టాలను దుర్గమ్మ రూపుమాపుతుందని ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. సమాజ హితమే భక్తికి పరమార్థం కావాలని, అప్పుడే కనకదుర్గాదేవి అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే ప్రవచన కార్యక్రమం శనివారం కేబీఎన్ కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా గరికిపాటి మాట్లాడుతూ.. సృష్టిలో ప్రతి అణువులోనూ అమ్మశక్తి దాగి ఉంటుందన్నారు. కురుక్షేత్ర యుద్ధానికి మూలంగా నిలిచిన అర్జునుడికి శక్తినిచ్చిన తల్లి కనకదుర్గాదేవి అని, దుర్గా శక్తివల్లనే పరమేశ్వరుడు కూడా తన కర్తవ్యాన్ని నిర్వహించగలుగుతున్నాడని వివరించారు.ఆదిశంకరాచార్యులు రచించిన కనకదుర్గానంద లహరిలోని శ్లోకాలను గానం చేసి పరమార్థాన్ని వివరించారు.

పుడమి పులకించేలా... గ్లోబ్ నమూనా తయారు చేసిన విద్యార్థులతో వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్‌రావు



ప్రతిభాలోత్సవ్ !

- తెలుగుపై మమకారాన్ని చాటిన బాలలు
- అలరించిన నృత్య ప్రదర్శనలు
- సామాజిక స్పృహ చాటిన నాటికలు
- రెండవ రోజూ చిన్నారుల సందడి



జాన'పాదం'.. జానపద నృత్యం చేస్తున్న ఓ విద్యార్థిని



నాట్య మయూరాలు.. నృత్య ప్రదర్శనకు సిద్ధమైన బాలికలు

పెదకాకాని: ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ – 2024 వేడుకల్లో చిన్నారులు రెండవ రోజైన శనివారం కూడా సందడి చేశారు. పద్యపఠనం, ఏకపాత్రాభినయం, శాస్త్రీయ, జానపద నృత్యాలతో వీవీఐటీ కళాశాల పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు తెలుగు భాష, సంస్కృతిపై మమకారాన్ని చాటి చెప్పారు.

మూడు రోజుల బాలోత్సవ్ వేడుక శుక్రవారం ప్రారంభం కాగా... శనివారం ఉత్సాహంగా సాగింది. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కొనసాగుతున్న ఈ వేడుకకు సందర్శకులు పెద్దసంఖ్యలో వచ్చారు. ప్రాంగణం కళకళలాడింది. 230 పాఠశాలల నుంచి 2,500 మంది పోటీల్లో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 250 జానపద నృత్యాలు ఎందడిగా సాగాయి. 31 నాటికలు సమాజం పట్ల వారికున్న దృక్పథాన్ని చాటాయి. సమాజానికి హితవు పలికేలా సాగుతూ ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు, వక్తృత్వ పోటీలు వారిలోని సృజనాత్మకతను వెలికితీశాయి. బాలల అనుభవాలు, ఆలోచనలు నేటి సమాజానికి ఉపయోగపడేలా న్యాయ నిర్ణేతలు ప్రత్యేక సూచనలు చేశారు. వాద్య సంగీత పోటీలు ఆకట్టుకున్నాయి. కథా సమాహారం పంచతంత్రం తెలుగు అనువాద గ్రంథం వీవీఐటీ 32వ ప్రచురణను సంస్థ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, కొత్తగూడెం బాలోత్సవ్ సృష్టికర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, పోటీల విజేతలు ఆవిష్కరించారు.



భావి తేజస్సు..
నృత్యం చేస్తున్న విద్యార్థిని



సంప్రదాయం చాటేలా..
జానపద వేషధారణలో బాలిక



అభి'నవ' ప్రతిభ..
సత్యభామ వేషధారణలో ఓ బాలిక

రోడ్డు ప్రమాదాల నివారణ కీలకం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలిసి నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జాతీయ రహదారులపై పెద్ద వాహనాలు మాత్రమే తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలను సర్వీస్ రోడ్లకే పరిమితం చేయాలని సూచించారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రహదారుల మరమ్మతులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగితే వెంటనే నేషనల్ హైవే అథారిటీ హెల్ప్ లైన్ నెంబర్ 1033 కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పట్టణంలో అనేక చోట్ల ట్రాఫిక్ సిగ్నలింగ్ లైట్లు పనిచేయడం లేదని, వాటిని త్వరగా మరమ్మతులు చేయాలన్నారు. కొన్ని ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగా, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడటంతోనే జరగుతున్నాయని కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందన్నారు. వ్యాపారులు తమ వాహనాలను సెల్లార్లలోనే పెట్టుకోవాలని సూచించారు. రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు అవకాశమున్న వారు సమీపంలోని హాస్పిటల్స్‌కు క్షతగాత్రులను తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో డీటీసీ కె.సీతారామిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, ఏపీ ఎస్ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలను పరిశీలించి, నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ద్వితీయ శ్రేణి అధికారుల గ్రీవెన్స్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

చిక్కుకుంటే చుక్కలే!

- నగరంలో ఎక్కడిబడితే అక్కడే వాహనాల పార్కింగ్
- నిత్యం ఉదయం, సాయంత్రం వాహన చోదకులకు నరకం
- రోడ్లను ఆక్రమించుకుంటున్నా పట్టని ట్రాఫిక్ పోలీసులు
- వ్యాపార కార్యకలాపాలకు అక్రమంగా సెల్లార్ల వినియోగం
- నామమాత్రంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తనిఖీలు



పాత బస్టాండ్ సెంటర్‌లో నడిరోడ్డును ఆక్రమించి మరీ పార్కింగ్ చేసిన దృశ్యం

పట్నంబజారు: నానాటి పెరిగిపోతున్న వాహనాలకు తోడు ఎక్కబడితే అక్కడ పార్కింగ్ చేస్తుండటంతో నగరంలో ప్రయాణం అంటేనే నరకయాతన తప్పడం లేదు. గుంటూరు నగరంలో సుమారు 20 వేలకుపైగా ఆటోలు, 4 లక్షలపైగా బైకులు, 46 వేల కార్లు, జీపులు ఉన్నాయి. నిత్యం నగరంలో భారీగా వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. పలు కమర్షియల్ కాంప్లెక్స్‌లు, వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, హోటళ్ల వద్ద రోడ్డును ఆక్రమించుకుని పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు పట్టించుకోక పోవడంతో సమస్య ఉత్పన్నమైంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద పలు ప్రధాన హోటళ్లు సగానికిపైగా రోడ్డు ఆక్రమించాయి. ఇటీవల మధువన్ హోటల్ వారు కూడా పార్కింగ్ ప్లేస్ కోసం అక్కడి బడ్డీ కొట్టును అధికార పార్టీ నేతల అండతో తొలగించిన అంశంపై వివాదం జరిగింది. నాజ్ సెంటర్ సమీపంలోని ఒక వ్యాపార సంస్థ పార్కింగ్ కల్పించాల్సింది పోయి.. రూ. 20 వసూలు చేస్తోంది. రాధాకృష్ణ థియేటర్ సెంటర్‌లో ఒక భారీ వస్త్ర షోరూమ్, పక్కనే ఉన్న మమత హోటల్‌కు వచ్చే వారు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి కావటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. నిత్యం అక్కడ విధులు నిర్వర్తించే కానిస్టేబుల్, హోంగార్డులు పట్టించుకోవడం లేదు. ఆసుపత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో సెల్లార్లు పార్కింగ్ కోసం వినియోగించాలి. కానీ మెడికల్ షాపులు, ల్యాబ్‌లు, ఇతర వ్యాపారాల కోసం సామాన్లు పెట్టుకుంటున్నారు. అద్దెలకు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో సెల్లార్ కార్యకలాపాలను తొలగించినా ఇటీవలి కాలంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టలేదు.



నగరంపాలెంలోని ఓ హోటల్ ఎదుట రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యం

వసూళ్లకే ప్రాధాన్యం

ఆసుపత్రులు ఎక్కువగా ఉండే ఓల్డ్‌క్లబ్ రోడ్డులో పరిస్థితి దారుణం. ఆసుపత్రుల యాజమాన్యాలు పార్కింగ్ వసతి కల్పించడం లేదు. సెల్లార్లను కూడా వారి స్వలాభాలకే వాడుకుంటున్నారు. సెక్టార్ ఎస్ఐ, ఆయన అసిస్టెంట్‌లపై అవినీతికి ఆరోపణలున్నాయి. ఓల్డ్‌క్లబ్ రోడ్డు చివర ఇటీవల అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయని డ్రైవరు చెప్పాడు. ఖాకీ చొక్కా లేదని వారు. రూ. 200 తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. అరవై అడుగుల రోడ్డులో కూడా ఇదే పరిస్థితి. మాయాబజారులో పరిస్థితి మరీ దారుణం. ఇక హిమని కూల్‌డ్రింక్స్ సెంటర్ – పూల కొట్లు సెంటర్‌ల వరకు కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు గతంలో డ్రైవ్ చేపట్టారు. సెక్టార్ ట్రాఫిక్ అధికారి మాత్రం బండ్లు రోడ్లుపై పెట్టుకునేందుకు అనుమతిస్తున్నారని తెలుస్తోంది. నిత్యం బండికి ఇంత అంటూ వసూలు చేస్తునట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ట్రాఫిక్‌లో చేసినప్పుడు ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయని తెలుస్తోంది. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్‌లో ప్రజలకు ఇదే దుస్థితి ఎదురవుతోంది. బ్రాడీపేట నాలుగో లైనులో ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. నగరంపాలెం ప్రధాన రహదారిలోని షాపింగ్ మాల్‌కు వచ్చే వారు ఉదయం నుండి రాత్రి వరకు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. కొరిటిపాడు సెంటర్‌లోని హోటల్ వద్ద అడ్డగోలుగా పార్కింగ్ చేయడం నిత్యకృత్యం అయింది. గుజ్జనగుండ్ల సమీపంలోని ఒక వ్యాపార సముదాయం వద్ద నడిరోడ్డుపైనే వాహనాలు ఉంటున్నాయి. చాలా షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ టోకెన్లు కూడా వసూలు చేస్తున్నారు. కానీ ఇంతవరకు సమీక్ష కూడా చేయలేదు. చిరు వ్యాపారులపై ప్రతాపం చూపుతున్నారు.

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తులు





ఆలయ ప్రాంగణంలో జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి దంపతులు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి. మల్లికార్జునరావు దంపతులు, జస్టిస్ కె. సురేష్‌రెడ్డి దంపతులు శనివారం పూజలు చేశారు. తొలుత వారికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణలు చేసిన అనంతరం స్వామిని దర్శించుకుని, ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేశారు. స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మూడు లారీలు ఢీ.. ఇద్దరు డ్రైవర్లు మృతి

గుంటూరు రూరల్: ఆగి ఉన్న కంటెయినర్‌ను వెనుక నుంచి ఒకదాని తరువాత మరొకటి రెండు లారీలు ఢీకొన్నాయి. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన ఈ దుర్ఘటనలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ మండలం బుడంపాడు సమీపంలో ఎన్‌హెచ్ 16 హైవేపై మద్రాసు వైపు నుంచి విజయవాడ వైపునకు వెళుతున్న కార్ల కంటైనర్ బ్రేక్ డౌన్ అవ్వటంతో బిహార్‌కు చెందిన డ్రైవర్ రోడ్డుపక్కన నిలిపి చెక్ చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి వైజాగ్‌కు ప్లైవుడ్‌తో వెళుతున్న లారీ వచ్చి ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడు. ఇతడి వివరాలు తెలియరాలేదు. మరి కొంత సేపటికి ఈ రెండు లారీలను ఐచర్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన ఎస్. నరేష్ (30) తీవ్రగాయాలపాలై వాహనంలో ఇరుక్కున్నాడు. స్థానికులు, పోలీసులు అతడిని రక్షక్ వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నరేష్ మృతి చెందాడు.



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,200** గరిష్టం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,800**

క్లుప్తంగా

కవాతుతో క్రమశిక్షణ



నగరంపాలెం: కవాతుతో క్రమశిక్షణ అలవాటవుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ కవాతు మైదానంలో శనివారం పోలీస్ అధికారులు, సిబ్బంది కవాతు నిర్వహించారు. పోలీసుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కవాతుతో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఓర్పు అలవాటవుతాయని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, కవాతు పరేడ్ కమాండర్ ఆర్ఐ సూర్య భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం పక్కనున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) కార్యాలయాన్ని ఎస్పీ పరిశీలించారు. ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

రేపు రోల్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాల, బాలికలకు రోల్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక సోమవారం జరగనుంది. ఆ రోజు ఉదయం 9 గంటలకు గుంటూరులోని బీఆర్ స్టేడియంలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న త్రోబాల్ అండర్-14, 17 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పెనుమాక జెడ్పీ హైస్కూల్లో ఉంటుందని తెలిపారు.

పేదరిక నిర్మూలనకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్



తాడేపల్లి రూరల్: పేదరికం పూర్తిగా నిర్మూలించేలా ఆర్థిక వికాసానికి తోడ్పడేందుకు మెప్మా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ ప్రారంభించామని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మెప్మా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.79 లక్షల సంఘాల ద్వారా ఆర్థిక సాధికారత దిశగా మెప్మా కృషి చేస్తోందని చెప్పారు. సభ్యుల వివరాలను నాలుగు స్థాయిలలో తనిఖీ చేయిస్తామన్నారు. సంఘ గ్రేడింగ్ బట్టి భవిష్యత్తు కార్యక్రమాలను నిర్దేశిస్తామని తెలిపారు. ఈ నెల 8 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్పీలతో సమాచారం సేకరించి డిసెంబర్ నెలలో డేటా వ్యాలిడేషన్‌ను పూర్తి చేస్తామని వివరించారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు కంప్యూటర్, ట్యాలీ కోర్సులలో 35 రోజుల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 90004 87423 ఫోను నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కూటమి కుట్రలపై
పోరాట ఘనత కార్యకర్తలదే

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- కేసులు పెట్టినంత మాత్రాన భయపడేదే లేదు
- గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల



మాట్లాడుతున్న అంబటి రాంబాబు, వేదికపై అంబటి మురళీకృష్ణ, మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుతో కుట్రలు చేస్తున్నా భుజానికెత్తుకున్న వైఎస్సార్ సీపీ జెండాను కిందకు దింపకుండా మొక్కవోని ధైర్యంతో పోరాడుతున్న ఘనత కార్యకర్తలదేనని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. గుంటూరు నగరం బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పొన్నూరు నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం జరిగింది. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఒక విష సంస్కృతికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందన్నారు. కార్యకర్తలు, సోషల్‌మీడియా యాక్టివిస్ట్‌లను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ సమయంలో కూటమి కుట్రలపై పోరాడేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కేసులు పెడితే భయపడతామా?

వైఎస్సార్ సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా లీగల్ విభాగం కమిటీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏ ఇబ్బంది కలిగినా నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకుంటామని పేర్కొన్నారు. దాడులు, దౌర్జన్యాలతో కూటమి రాక్షస పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని దాటుకుని పార్టీని పటిష్టపరిచేలా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని సూచించారు. వారి వెంట తామంతా నడుస్తామని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం

పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

నియోజవకర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ చెప్పారు. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన వారికి ప్రాధాన్యం దక్కేలా చూస్తామన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బంది కలిగినా.. కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. ఓడిపోయామనే నిరుత్సాహాన్ని వీడి ప్రతి కార్యకర్త సైనికుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్నివర్గాల గురించి నిత్యం ఆలోచించే గొప్ప మనసున్న వ్యక్తి వైఎస్ జగన్ అని తెలిపారు. కచ్చితంగా భవిష్యత్తు మనదేనని, కూటమిపై ప్రజల్లో కేవలం ఐదు నెలల కాలంలోనే నమ్మకం పోయిందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పార్టీని మరింత పటిష్ట పరచాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

ప్రత్తిపాడులో మోహన్ ట్రేడర్స్, మ్యాక్స్ సొసైటీలపై కేసు నమోదు



గోడౌన్‌లో స్టాక్ పరిశీలిస్తున్న ఏవో

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని మోహన్ ట్రేడర్స్, మ్యాక్స్ సొసైటీ, సాయిరాం ట్రేడర్స్, అమరలింగేశ్వర ఫెర్టిలైజర్స్‌లో ఏవో కె. అరుణకుమారి శనివారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్లలో ఉన్న ప్రకారం గోడౌన్లలో సరకును పరిశీలించారు. వివరాల మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో మోహన్ ట్రేడర్స్‌లో రూ. 12,13,920 విలువ చేసే 47.97 మెట్రిక్ టన్నుల ఎరువులు, మ్యాక్స్ సొసైటీలో రూ. 1,18,250 విలువ చేసే 10.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశారు. నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేస్తున్నట్లు ఏవో తెలిపారు. మోహన్ ట్రేడర్స్ లైసెన్సును తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు చెప్పారు.

చేనేత పరిరక్షణకు నిధులు కేటాయించాలి



సమావేశంలో చేనేత సంఘాల నాయకులు

మంగళగిరి: చేనేతలను విస్మరిస్తూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌ను ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్ భవన్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చేనేత వృత్తి పరిరక్షణ కోసం రూ.2 వేల కోట్లు కేటాయించాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ఏడాదికి రూ.24 వేలు చొప్పున 80 వేల కుటుంబాలకు అందించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఇనమాల శివరామప్రసాద్, చేనేత సంఘాల నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, వాసా పల్లపురాజు, రామనాథం పరమేశ్వరరావు, బల్ల వెంకటరమణ, గుర్రం చినవీరయ్య, బత్తూరి వినాయకరావు, గజవల్లి వెంకటకృష్ణ, దొడ్డి ఈశ్వరరావు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళతో యువకుడి అసభ్య ప్రవర్తన



నిందితుడు విజయ్

తాడేపల్లి రూరల్: ఓ యువకుడు మహిళతో నడిరోడ్డుపై అసభ్యంగా ప్రవర్తించాడు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు మూడు బొమ్మల సెంటర్ వద్ద ఈ ఘటన జరిగింది. విజయ్ అనే యువకుడు మొదట రోడ్డు వెంబడి వెళ్లే విద్యార్థినులను వెంబడించగా, వారు భయంతో పారిపోయారు. తర్వాత తనకు ఎదురుగా వస్తున్న మహిళ చేయి పట్టుకుని అతడు లాక్కెళ్లబోయాడు. సదరు మహిళ పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి విజయ్‌ను అడ్డుకున్నారు. తర్వాత తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. స్థానికులు పట్టుకున్న సమయంలో అతడు తన వద్దనున్న గంజాయి పొట్లాన్ని పిచ్చి మొక్కలలోకి విసిరివేశాడని అక్కడున్నవారు తెలిపారు. విజయ్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు తాడేపల్లి సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు. విజయ్ మద్యంగానీ, గంజాయిగానీ తాగలేదని, మానసిక పరిస్థితి బాగోలేక అలా ప్రవర్తించి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముగ్గురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: మాదక ద్రవ్యాలను తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ ఎ.వి.శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలానికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ బాషి ప్రస్తుతం యానాదికాలనీలో నివాసం ఉంటున్నాడు. గుంటూరులోని నెహ్రూనగర్‌కు చెందిన పఠాన్ మున్నా, అరుంధతినగర్‌కు చెందిన ముక్కంటి రాము అలియాస్ రవి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో శనివారం ఏటుకూరు రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డు వద్ద బెంగళూరు నుంచి తీసుకొచ్చిన 15 గ్రాముల మాదకద్రవ్యం 'మెత్'ను మూడు ప్యాకెట్లు చేసి పంచుకుంటున్న సమయంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మెత్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 50వేలకుపైగా ఉంటుందని తెలిపారు. నిందితుల్లో షేక్ గౌస్‌బాషాపై లాలాపేట పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని చెప్పారు. గంజాయి విక్రయం, ప్రస్తుతం మెత్‌ను బెంగళూరు నుంచి ఇతడే తీసుకొచ్చినట్లు గుర్తించారు. పఠాన్ మున్నాపై కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి కేసు ఉందని వివరించారు. ముక్కంటి రాము అలియాస్ రవిపై పాతగుంటూరు, అరండల్‌పేట పోలీసు స్టేషన్‌ల పరిధిలో గంజాయి, చోరీ కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన హెడ్‌కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు, ఆర్.అనంతకుమార్, కానిస్టేబుల్ పి.కిరణ్, ఎ.రాంబాబు, ఎం.కళ్యాణ్, అప్పలనాయుడు, తిరుమలరావులను డీఎస్పీ అభినందించారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

క్షణికావేశంలో విద్యార్థిని ఆత్మహత్య

- కళాశాల ఎదుట విద్యార్థిని బంధువుల ఆందోళన



ఆసుపత్రిలో అనూష మృతదేహం

నరసరావుపేట రూరల్: పెన్ను విషయమై తోటి విద్యార్థులతో ఘర్షణ పడి క్షణికావేశంలో కళాశాల భవనం నాల్గవ అంతస్తు నుంచి దూకి ఇంటర్మీడియట్ విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన జెట్టి అనూష(17) రావిపాడురోడ్డులోని ప్రైవేటు కళాశాల బాలికల క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతుంది. అపార్ట్‌మెంట్‌లో హాస్టల్‌తో పాటు తరగతి గదులను కళాశాల నిర్వహిస్తుంది. మొదటి అంతస్తులో తరగతులు, మిగిలిన మూడు అంతస్తులతో హాస్టల్, సెల్లార్‌లో మెస్ నిర్వహిస్తున్నారు. ఉదయం తరగతులకు హాజరైన అనూష తోటి విద్యార్థులతో కలిసి మెస్‌కు వచ్చింది. అనంతరం ఉదయం 8.30గంటల సయంలో హాస్టల్‌కు వెళ్లిన అనూష నాల్గవ అంతస్తుపై నుంచి కాకతీయనగర్ వైపు దూకింది. పెద్ద శబ్దం రావడంతో విద్యార్థులతో పాటు కళాశాల సిబ్బంది అటువైపు పరుగులు తీశారు. తీవ్ర గాయాలతో ఉన్న అనూషను ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందింది. అనూష మృతి సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు అధిక సంఖ్యలో ఏరియా వైద్యశాలకు వచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసి అనూష తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కూలీ పని చేసుకునైనా నిన్ను చదివిద్దామనుకుంటే ఇలా ఎలా చేశావమ్మా అంటూ వారు విలపించిన తీరు చూపరులను కన్నీరు పెట్టించింది.

ఉద్యోగినులకు రక్షణ హక్కు



మాట్లాడుతున్న సత్యవతి

నగరంపాలెం: ఏ రంగంలోనైనా విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులు ఎలాంటి ఒత్తిడి, వేధింపులకు గురికాకుండా పనిచేసే హక్కు ఉంటుందని ఒకటో అదనపు జిల్లా జడ్జి వీపీఎల్ సత్యవతి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం మహిళా ఉద్యోగులకు పోష్ యాక్ట్, సైబర్ లాస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి టి.లీలావతి అధ్యక్షత వహించి మాట్లాడారు. విధులు నిర్వర్తించే కార్యాలయాలు, ప్రదేశాలలో మహిళా ఉద్యోగులు ఎదుర్కొనే శారీరక, మానసిక వేధింపులు, పని ఒత్తిడిని ఎలా అధిగమించాలి అనే అంశాలపై వివరించారు. ఐదో సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) లత సైబర్ వేధింపులపై వివరించారు. నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

కాకాని శివాలయానికి కార్తిక శోభ



దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కార్తిక మాసం సందర్భంగా భక్తులతో కళకళలాడింది. పెదకాకాని శివాలయంలో శనివారం వేకువజామున సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. యజ్ఞాల బావి వద్ద కార్తిక మాస స్నానాలు చేసిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శివాలయ ప్రాంగణంలో ఇంటి నుంచి తెచ్చుకున్న పూజాద్రవ్యాలతో దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. స్వామి వారి దర్శనం సకాలంలో జరిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పూజలు అధికసంఖ్యలో జరిగాయి. రాత్రి సమయంలో కార్తిక దీప కాంతులతో ఆలయ ప్రాంగణం కళకళలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.





షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

తాడికొండ: తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో శనివారం షూటింగ్ బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈ మేరకు పీఈటీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 23, 24, 25 తేదీలలో అనంతపురంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఎంపికైన విద్యార్థులను షూటింగ్ బాల్ కార్యవర్గ సభ్యులు రవిబాబు, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, పీఈటీ తదితరులు అభినందించారు. ఉపాధ్యాయులు కిషోర్, నరేష్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.